ప్రజా విశ్వంభర

# పుష్కర కాలం తెలంగాణలో నెరవేరని ఉద్యమ ఆకాంక్షలు



డా.కాచం సత్యనారాయణ

**తెలంగాణ ఏర్పాటు అయి 12 ఎండ్లు అయినా ఇంకా అనేక సవాళ్ళు ఎదుర్కొంటుంది. ప్రజలు ఏమి కోరుకుంటున్నారు అనేది పాలకులు గుర్తించడం లేదు. ఎన్నికలు వస్తే ఓట్లు కొనుక్కొని గెలుస్తాం అనే నమ్మకం తప్ప ప్రజల ఆకాంక్షలు గుర్తించడంలో రాజకీయ పార్టీలు విఫలం అవుతూనే ఉన్నాయి. సంక్లిష్టమైన సకల జనుల పోరాటం ద్వారా ఏర్పడిన తెలంగాణ దాని లక్ష్యాన్ని నెరవేర్చ లేక పోయింది.**

రాష్ట్రం సాధించిన ఉద్యమ నాయకులు తెలంగాణ పునర్నిర్మాణం కేసీఆర్ చూసుకుంటాడు అని పక్కకు జరిగారు. ఇదే అదునుగా రాష్ట్ర ఏర్పాటు తర్వాత టీఆర్ఎస్ 'ఫక్తు రాజకీయ పార్టీ' గా అవతరించి నీళ్ళు నిధులు నియామకాలు అనే నినాదం లక్ష్యంగా పనిచేయకుండా తన సొంత అజెండా అమలు చేసింది.తెలంగాణ ఉద్యమం ప్రధానంగా సాగునీరు మీదే సాగింది కనుక టీఆర్ఎస్ అధికారంలోకి వచ్చినతర్వాత రాష్ట్రంలోసాగునీటి సౌకర్యాలను పెంపోదించేందుకు తెలంగాణ ప్రభుత్వం 'మిషన్ కాకతీయ'లాంటి ఇరిగేషన్ స్కీమ్‌లను ప్రారంభించింది. చెరువుల మీద ఆధారపడే వ్యవసాయానికి దన్నుగా నిలిచే క్రమంలో గ్రామీణ చెరువులను పూడిక తీయించడం, బాగు చేయించడంలాంటి కార్యక్రమాలను పెద్ద ఎత్తున చేపట్టింది. వ్యవసాయ ఉత్పత్తులలో భారీ పెరుగుదల రూపంలో వీటి ఫలాలు కనిపించాయి. రైతుబంధు, రైతుబీమాలాంటి పథకాలు అన్నదాతలకు ఊతమిచ్చాయి. ఒకవైపు వ్యవసాయరంగానికి వెన్నుదన్నుగా నిలుస్తూనే మౌలిక సదుపాయాల విస్తరణపై కూడా ప్రభుత్వం దృష్టి పెట్టింది. హైదరాబాద్ నగరం ఐటీ రంగానికి వెన్నెముక కాగా, వీటితోపాటు ఫార్మా, టెక్స్‌టైల్ సిటీలు పారిశ్రామికాభివృద్ధికి చోదకాలుగా మారాయి. పాలనను వికేంద్రీకరణలో భాగంగా 10 జిల్లాలను తెలంగాణ ప్రభుత్వం 33 జిల్లాలుగా విభజించింది. కొత్త జిల్లాలు, మండలాలు, పంచాయతీలను ఏర్పాటు చేసి పాలనా సంస్కరణలకు శ్రీకారం చుట్టింది. జిల్లా కేంద్రాల్లో సమీకృత కలెక్టరేట్లు, పోలీసు కార్యాలయాలను, ఎమ్మెల్యే క్యాంపు ఆఫీసులను నిర్మించింది. ఇక రాష్ట్ర పరిపాలనా కేంద్రమైన సచివాల యాన్ని ఆధునిక హంగులతో నిర్మించింది. ఏడు నూతన పోలీస్ కమిషనరేట్లతో పాటు పోలీస్ స్టేషన్లను ఆధునీకరించింది. రాజధాని నగరంలో పోలీస్ కంట్రోల్ సెంటర్ ను ఏర్పాటు చేసింది. పల్లెప్రగతి, పట్టణ ప్రగతి తో ఆయా మెరుగైన ఫలితాలను తీసుకొచ్చింది.ప్రపంచం లోనే అతిపెద్ద ఎత్తిపోతల పథకం కాళేశ్వరం వంటి భారీ నీటిపారుదల ప్రాజెక్టులను నిర్మించింది. అయితే కేసీఆర్ ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్ట్ కోసం లక్ష కోట్లు అప్పు చేసి ఖర్చు చేసింది. ఫలితం శూన్యం. దీర్ఘ కాలిక లక్ష్యాలు పక్కకు పెట్టి ఓట్లే లక్ష్యంగా పథకాలు ప్రవేశ



పెట్టింది. అప్పులు పెరిగి ఆర్థిక వ్యవస్థ కుదేలు అయింది. తద్వారా రెండు లక్షల ఉద్యోగాలు ఇవ్వలేక పోయింది. పేదల కొనుగులు శక్తి పెంచే కార్యాచరణ లేకుండా పోయింది. కాంట్రాక్టర్ ల కోసమే ప్రాజెక్ట్ లు కట్టడం వల్ల రాజకీయ నాయకులు వేల కోట్లు సంపాదించారు. ఐటీ రంగం, ఔషధాలు, వ్యవసాయం ద్వారా తెలంగాణ ఆర్థిక వ్యవస్థ కొంత స్థిరంగా ఉన్నప్పటికీ, ఆదాయం కంటే వ్యయాలు పెరగడం ద్వారా ఆర్థిక వ్యవస్థ అస్త వ్యస్తం అయింది. టీఆర్ఎస్ ప్రభుత్వం రైతు బంధు పథకం మిషన్ భగీరథతో సహా వివిధ సంక్షేమ పథకాలను అమలు చేసి నప్పటికీ అందులో ఉన్న అనేకలోపాల కారణంగా ఫలితాలు కొంత మందే అనుభవించారు. కేంద్ర ప్రభుత్వ సహాయంతో రోడ్లు, వంతెనలు, ప్రజా రవాణాతో సహా మౌలిక సదుపాయాల అభివృద్ధిలో రాష్ట్రం ముందున్నది. ధనిక రాష్ట్రంగా అవతించిన తెలంగాణ ఇంకా ఎంతో అభివృద్ధి పంథాలో నడవాల్సిన తెలంగాణ పాలకుల స్వార్థ లక్ష్యాల కారణంగా గాడి తప్పింది.తెలంగాణ ప్రజలు పుర్నిర్మాణం అనే పెద్ద పెద్ద కోరికలు ఏమి కోరకోవడం లేదు. ఆదాయం తగ్గి ఖర్చులు పెరిగి పిల్లల స్కూల్ ఫీజులు కట్టలేక దవాఖాన లో లక్షల రూపాయలు కట్టలేక సగటు కుటుంబాలు ఆర్థికంగా చితికి పోతున్నాయి. దేశంలో ధనిక రాష్ట్రంగా అవతరించిన తెలంగాణ ఉచిత విద్య, ఉచిత వైద్యం, ఉండడానికి ఒక చిన్న ఇల్లు, రైతు పండించిన పంటకు గిట్టు బాటులాంటి పథకాలు ఇస్తే చాలు అని ప్రజలు అనుకుంటున్నారు. ఎందుకు వీటిని అమలు చేయలేక పోతున్నాం? రాజకీయ పార్టీలు ఎందుకు తమ మానిఫెస్టోలో ఈ పథకాలు పెట్టలేక పోతున్నాయి. విద్య, వైద్యం వ్యాపారం చేసి లక్షల కోట్లు పేద ప్రజల సొమ్మును దోసు కుంటున్నది ఎవరు? ఇక ఉద్యమంలో రాజకీయ పార్టీలతో పాటు ప్రజా సంఘాలు ప్రధాన భూమిక పోషించాయి.కానీరాష్ట్ర సాధన తర్వాత ఆయా సంఘాలను కేసీఆర్ పక్కన పెట్టారనే ఆరోపణ ఉంది. ఆయా రంగాలకు చెందిన మేధావులు, విద్యావంతులు, సాంస్కృతిక సంఘాలు తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్రపోషించాయి. అయితే రాష్ట్ర ఏర్పాటు తర్వాత వాటికి తగిన గుర్తింపు దక్కలేదన్నది ప్రధాన ఆరోపణ. దానితో ఆయా సంఘాలు ప్రభు త్వానికి దూరమయ్యాయి. స్వాతంత్ర తెలంగాణ రాష్ట్రంలో ప్రజాసంఘాల ఆశలు నెరవేరుతాయనుకుంటే అవన్ని అడి ఆశలయ్యాయి. ఇక ఉద్యమ పార్టీగా ఉద్యమాన్ని నడిపిన టీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఫక్తు రాజకీయ పార్టీగా రూపాంతరం చెందడంతో ఇతర పార్టీల ఎమ్మెల్యేలను బీఆర్ ఎస్ లో కలుపుకొవడంతో ప్రతిపక్షాల పాత్ర లేకుండా పోయింది. దీంతో ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లే రాజకీయ పార్టీ కరువైంది.నియమకాల విషయంలోనూగత ప్రభు త్వం తొలి ఐదేండ్లు పూర్తి నిర్లక్షంగా వ్యవహరించిందనే ఆరోపణలు ఉన్నాయి. తరువాతి కాలంలో ఎన్నికల సమయంలో ఉద్యోగ నోటిఫికేషన్లు వేసినప్పటికీ పేపర్ లీకుల పేరుతో జరిగిన పరిణామాల నేపథ్యంలో బీఆర్ఎస్ ఉద్యోగ కల్పనలో విఫలమైందనే ఆరోపణలు ఉన్నాయి. ఈ మూడు అంశాల్లో నెలకొన్న లోటుపాట్లే బీఆర్ఎస్ ను అధికారానికి దూరం చేశాయి. ఇక మొన్నటి ఎన్నికల్లో అనేక అంశాల్లో హామీలిచ్చి ధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఆయా హామీలను నిలబెట్టుకోవడంలో తడబడుతోంది. మహిళలకు ఉచితబస్సు, 500 వందలకే గ్యాస్, ఉచిత విద్యుత్ వంటి అంశాల్లో కొంత వరకు మెరుగైన ఫలితాలు సాధించి నప్పటికీ రైతుబంధు (భరోసా), సాగునీటి సరఫరా, రుణమాఫీ, ఉద్యోగ కల్పన వంటి అంశాల్లో ముందడుగు పడాల్సి ఉంది. ఒకవైప ప్రజా సమస్యలపై దృష్టి పెట్టాల్సిన ప్రభుత్వం రాష్ట్రలోగో మార్పు , విగ్రహాల మార్పు, గీతం ఏర్పాటు వంటి అంశాల్లో తలదూర్చి అబాసు పాలవుతోంది. ప్రజాపాలన పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఇలాంటి చిన్నచిన్న విషయాలకు ప్రాధాన్యతనిస్తూ ముఖ్యమైన విషయాలను విస్మరించడం వల్ల గత ప్రభుత్వపు తప్పిదాల మార్గంలోనే నడుస్తోంది. పద్నాలుగేళ్ల మలిదశఉద్యమంలో ప్రజలు ఆశించిన తెలంగాణ ఇంకా సాకారం కాలేదన్నది అన్నివర్గాల అభిప్రాయం.రాష్ట్రంలో విద్య, వైద్య, ఉద్యోగ కల్పన రంగాల్లో పురోగతి సాధించాల్సి ఉంది. ముఖ్యంగా వ్యవసాయరంగానికి ఊతమిచ్చే నీటిపారుదల రంగాన్ని మెరుగు పరచి అన్నదాతలను ఆదుకోవాలి. ఉద్యమ కాలంలో ఇచ్చిన హామీలు, చేసిన పనులు, ప్రజల ఆకాంక్షలు, లక్ష్యాలను మరోసారి అవలోకనం చేసుకోవడం ద్వారా ఆయా రంగాల్లో పురోగతి సాధించినప్పుడే సాధించు కున్న తెలంగాణకు సార్థకత లభిస్తుంది. ఆ దిశగా అడుగులు పడాల్సి ఉంది. పాలకులను సన్మార్గంలో నడిపించడానికి ఆయా రంగాలకు చెందిన మేధావులు, విద్యావంతులు, సాంస్కృతిక సంఘాలు, సామాజిక సంస్థలు తమదైన పాత్రను పోషించాల్సి ఉంది.

# ప్రపంచ గతిని మార్చిన సిద్ధాంత కర్త కారల్ మార్క్స్

**(నేడు ఆయన వర్ధంతి)**

**ప్రపంచ గతిని మార్చిన సిద్ధాంతకర్త, ప్రపంచ మానవాళికి దోపిడి విముక్తి సిద్ధాంతాన్ని అందించిన ప్రపంచ మేధావి, మహనీయుడు కామ్రేడ్ కారల్ మార్క్స్. సమాజంలో ఉన్న దోపిడీకి మూలం శ్రమ దోపిడీ అని దానికి వ్యతిరేకంగా వర్గ పోరాటాలు నిర్వహించడం ద్వారా సమాజాన్ని మార్చవచ్చు అనే సిద్ధాంతాన్ని సృష్టించిన సృష్టికర్త కారల్ మార్క్స్. నేడు ఆయన వర్ధంతి సందర్భంగా విశ్వంభర ప్రత్యేక కథనం..**

18వ శతాబ్దం మలి భాగము నుండి 19వ శతాబ్దం మధ్య వరకు వాయువ్య యూరప్ అమెరికా ప్రాంతాలలో పెట్టుబడిదారీ విధానం నాటకీయంగానూ విప్లవకరంగానూ వృద్ధి చెందింది. ఈ కాలంలోనే ప్రపంచ చరిత్రను మలుపు తిప్పిన గొప్ప పరిణామాలుగా ఇంగ్లాండ్ లో జరిగిన 1789 పారిశ్రామిక విప్లవం,ఫ్రెంచి ఇంగ్లాండ్ వగైరా దేశాలలో జరిగిన ప్రజాస్వామిక విప్లవాలు కొనసాగినకాలం. ఆనాడు ప్రబలమైనదిగా ఉండిన భూస్వామ్య విధానం పైన పెట్టుబడిదారీ విధానం తిరుగులేని విజయం సాధించింది.

పశ్చిమ యూరప్ ప్రభుత్వాల ప్రత్యేకించి బ్రిటిష్ వారి ప్రపంచ అధిపత్యము ఏర్పడిన కాలమది. ఆ అధిపత్యం పెట్టుబడిదారీ దేశాలలో విప్లవ కరమైన సామాజిక ఆర్థిక పరివర్తనకు దారి తీసింది. అంతేకాదు అది ప్రపంచంలోని పురాతన నాగరికతలు సామ్రాజ్యాలు పెద్ద సంఖ్యలో లొంగిపోవడానికి లేదా కుప్పకూలిపోవడానికి కూడా దారితీసింది. భారతదేశం బ్రిటిష్ గవర్నర్ల పాలన కింద ఉండే ఒక రాష్ట్రంగా మారిపోయింది .ఇస్లామిక్ దేశాలు సంక్షోభంలోకి తోసి వేయబడ్డాయి. 1839- 42 మధ్య కాలంలో గొప్ప చైనా సామ్రాజ్యం సైతం పాశ్చాత్య దోపిడికి తలుపులు తెరవవలసిన స్థితికి నెట్టబడింది.పెట్టుబడి దారీ వ్యాపారపు పురోగమనానికి మరే అడ్డంకి లేకుండా పోయింది. వారు ప్రతి వెనుకబడిన దేశాన్ని వలసలుగా మార్చుకొని పెట్టుబడి దారి వలస సామ్రాజ్య అధిపత్యం నెలకొల్పిన కాలం.ప్రపంచ వ్యాప్తంగా ఎదురులేని అధికారంతో విర్ర వీగుతున్న బూర్జువా వర్గాన్ని ప్రతిఘటించ దానికి ,దానిని ఓడించేటటువంటి కార్మిక వర్గ శక్తుల సంఘటిత పోరాటానికి ,కమ్యూనిస్ట్ సిద్ధాంత ఆవిర్భావానికి కూడా దారితీసాయి. మానవ చరిత్రలో అతి గొప్ప మార్పులు సంభవిస్తూ కొన్ని పాశ్చాత్య పెట్టుబడి దారీ రాజ్యాలు ప్రపంచం పై పెత్తనాన్ని నెలకొల్పుతూ ఉన్న కాలములో మార్క్సిజం పుట్టింది .మార్క్సిజం పుట్టుకకు కారణమైన వస్తు గత పరిస్థితులను ఎత్తిచూపుతూ కామ్రేడ్ మావో ఇలా అన్నాడు:


"చరిత్రలో చాలా దీర్ఘకాలం పాటు మానవులు సమాజ చరిత్ర గురించిన అవగాహనలో అనివార్యంగానే ఏకపక్ష అవగాహనకు పరిమితమైపోయారు. దీనికి కారణం దోపిడి వర్గాల పక్షపాత బుద్ధి ఎల్లప్పుడూ చరిత్రను వక్రీకరించడం ఒకటైతే , చిన్న తరహా ఉత్పత్తి మానవుల దృక్పథాన్ని పరిమితం చేయడం రెండవ కారణం .బ్రహ్మాండమైన ఉత్పత్తి శక్తుల ( భారీ పరిశ్రమల)తో పాటు ఆధునికమైన కార్మిక వర్గం ఆవిర్భవించిన తర్వాతనే మానవుడు సమాజ అభివృద్ధిని గురించి సమగ్రమైన చారిత్రక అవగాహనను సంపాదించుకోగలిగాడు ఆ జ్ఞానాన్ని ఒక విజ్ఞాన శాస్త్రంగా మార్క్సిజం అనేవిజ్ఞాన శాస్త్రంగా మలుచుకోగలిగాడు."

మార్క్స్ జీవిత విశేషాలు..

మార్క్స్ 1818 మే 5న జర్మనీ దేశానికి చెందిన రైన్ రాష్ట్రంలోని టీయర్ నగరం?లో జన్మించాడు తండ్రి న్యాయవాది . మార్క్స్ మొదటగా న్యాయ శాస్త్రం చదివినాడు .చరిత్ర తత్వశాస్త్రంపై ప్రధానంగా తన అధ్యయనాన్ని కేంద్రీకరించాడు. తత్వశాస్త్ర సిద్ధాంతాలపై రచనలు కొనసాగిస్తూ ఒక పత్రికకు సైతం చీఫ్ ఎడిటర్ గా పనిచేసినాడు.తన అధ్యయనంలో ప్రపంచాన్ని గతి తార్కిక భౌతిక వాద దృక్పథంతో పరిశీలించిన ఫలితంగానే మార్క్స్ ప్రపంచ శ్రామిక వర్గ మహోపాధ్యాయుడుగా మారినాడు.మార్క్స్ తన ప్రేమికురాలు అయిన జెన్నీవాన్ వెస్ట్ ఫాలిన్ 1843 లో వివాహం చేసుకున్నప్పటి నుండి జెన్నీ అన్ని రకాలబలమైనతోడ్పాటుతోమాత్రమే మార్క్స్ సిద్ధాంతాలు అభివృద్ధి చేయగలిగినాడు 1844లో మార్క్ ఎంగెల్స్ లు పారిస్ లో కలిసి అత్యంత కార్మిక వర్గ మిత్రులుగా చివరివరకు కొనసాగినారు. 1847 మార్క్స్ ఎంగెల్స్ లు కమ్యూనిస్టు లీగ్ ప్రచార సంఘంలో చేరినారు 1847వ సంవత్సరములో కమ్యూనిస్టు ప్రణాళిక సమర్పించినారు .మార్క్స్ వర్కింగ్ ప్రెసిడెంట్ గా ఎంగెల్స్ తో 1864లో అంతర్జాతీయ కార్మిక సంఘం స్థాపించి కమ్యూనిజం ప్రచా రం ,కార్మిక ,కమ్యూనిస్ట్ సంస్థల నిర్మాణ కృషి చేసినారు.మార్క్స్ ఎంతో నికృష్ట జీవితాన్ని గడిపాడు ఎంగెల్స్ సహాయం చేయబట్టి గాని లేకపోతే పెట్టుబడి గ్రంథాన్ని పూర్తి చేయకపోవడమే కాక ఆర్థికలేమితో ముందే చనిపోయేవాడు. మార్క్స్ ఎంగెల్స్ సహాయంతో మార్క్సిజం అనే కార్మిక వర్గ విజ్ఞాన శాస్త్రం రూపొందింది.

**మార్క్స్ ఎంగెల్స్ రచనలే మార్క్సిజంగా..**

మార్క్స్ తో ఎంగెల్స్ చేసిన గొప్ప చేర్పులు విడదీసి చూడరానివి ఎంగెల్స్ తో కలిసే మార్క్స్ తన సిద్ధాంతాన్ని అభివృద్ధి పరి



చాడు. చరిత్ర పరిణామ క్రమం గురించి తత్వవేత్తల్లో వెనుకటి కాలం నుంచి దైవము ఆశించే దాన్ని బట్టొ ,దైవంశ సంభూతులైన రాజు, మత గురువుల ఇష్టాఇష్టాన్ని బట్టి మానవాతిత శక్తులను బట్టి సాగుతుందని భావ వాద దృక్పథం ప్రబలంగా వుంది.ఇదే భావ వాద దృక్పథం తో ప్రజలను తర తరాలుగా దోపిడీ చేస్తున్నది. .మానవ చరిత్ర పరిణామానికి ప్రధాన భౌతిక కారణంగా శ్రమ సంబంధాల నుంచి పుట్టుకొచ్చేదిగానే ఉంటుంది అని మార్క్స్ బహిర్గత పరిచినాడు. చరిత్ర గురించిన భౌతికవాద భావనను కనుగొనేందుకు సామా జిక అభివృద్ధి చలన నియమాలు ఏమిటి అనే గతితార్కిక పద్ధతిని కనుగొన్నారు. పెట్టుబడిదారీ విధానంలో వర్గ వైరుధ్యాలతో సహా ఆ విధానపు చలన నియమాలను దోపిడి మూలాన్ని బట్టబయలు చేసినారు.శ్రమ దోపిడికి కారణమైన అదనపు విలువ సిద్ధాంతాన్ని ఆవిష్కరించి కార్మిక వర్గ రాజకీయ అర్థ శాస్త్రం అభివృద్ధి చేశారు. వర్గ పోరాట సిద్ధాంతం పునాదిగా శాస్త్రీయ సోషలిజాన్ని అభివృద్ధి చేశారు. కార్మిక వర్గపు పోరాట వ్యూహము ఎత్తుగడలను నియంత్రించే సూత్రాలను రూపొందించారు. కార్మిక వర్గం పెట్టుబడిదారీ విధానాన్ని కూలదోసి తనను తాను విముక్తం కావించుకోవాలంటే అది తన సొంత కార్మిక వర్గ పార్టీని ఏర్పరుచుకోవాలని మార్క్స్ ఎంగెల్స్ లు ప్రబోధించినారు.కార్మిక వర్గ పార్టీ అంటే కమ్యూనిస్ట్ పార్టీ పెట్టుబడి దారి వర్గానికి వ్యతిరేక పార్టీ గానే వుంటూ రైతులు ఉద్యోగులు వగైరా శ్రామిక వర్గ ప్రజల మధ్య బలమైన ఐక్య సంఘటన ఏర్పడాలని చెప్పినారు.వర్గ సమాజంలో ఉత్పత్తి శక్తులకు ఉత్పత్తి సంబంధాలకు మధ్య ఉండే వైరుధ్యం వర్గ వైరుధ్యంగా ప్రతిఫలిస్తుందని వారు నిరూపించారు. ఈ వర్గ పోరాటమే సమాజానికి శోదక శక్తిగా పనిచేస్తుంది .అందువల్లనే వారు ప్రపంచ చరిత్రఅంటే వర్గ పోరాటాల చరిత్రని వర్ణించారు .కార్మిక వర్గం సమాజం లోని సకల శ్రామిక వర్గాలతో ఐక్యత ద్వారా మానవ సమాజాన్ని అన్ని రకాల దోపిడి అసమానతల నుండి విముక్తి చేయడానికి వర్గ పోరాట శాస్త్రాన్ని రచించినారు.బానిస సమాజం నుండి కమ్యూనిజం వరకు మానవ సమాజపు అభివృద్ధి క్రమంలో రాజ్యం ఎలా పుట్టి అభివృద్ధిచెందిఅంతరించిపోతుందో మార్క్స్ ఎంగెల్స్ లు వివరించారు." ఆధునిక రాజ్యం యొక్క పరిపాలన విభాగం అంటే మొత్తంగా బూర్జువా వర్గం యొక్క ఉమ్మడి కార్యకలాపాలను చక్కబెట్టే ఒక కమిటీ తప్ప మరేమీ కాదు" అని కమ్యూనిస్టు ప్రణాళికలో చేసిన ప్రకటన పెట్టుబడి దారి వర్గం పై వివిధ బూర్జువా పార్టీ ల పై ఖచ్చితమైన శ్రామిక వర్గ వైఖరి వెల్లడించారు.మార్క్సిజం అంటే తత్వశాస్త్రం (గతి తార్కిక భౌతిక వాదం )రాజకీయ అర్థశాస్త్రం (పెట్టుబడి) శాస్త్రీయ సోషలిజం, శ్రామిక వర్గ పోరాటాలఎత్తుగడల సమగ్ర సమహారం. మార్క్స్ రచనలువందల కొలది వున్నప్పటికీ మార్క్స్ బోధనలోని అతి ముఖ్యమైన అంశాలను క్లుప్తంగా ఏడు శీర్షికల కింద లెనిన్ విభజించి నాడు. 1)భౌతిక వాద తత్వశాస్త్రం 2) గతి తర్కం 3) చారిత్రక భౌతిక వాదం 4) వర్గ పోరాటం 5)మార్క్స్ ఆర్థిక సిద్ధాంతం 6) సోషలిజం 7)కార్మిక వర్గ పోరాట ఎత్తుగడలు. మార్క్స్ జీవితంలో ఆఖరి కొద్ది సంవత్సరాలు అనేక వ్యాధులతో బాధ పడ్డాడు. అవి అతని రాజకీయ, రచనా వ్యాసంగానికి ఆటంకంగా పరిణమించాయి. దానితో మార్క్స్ తాను రచించదలచుకున్న వాటిలో కొన్నింటిని రచించలేక పోయి చివరకు లండన్ లోనే మార్చి 14, 1883 న మరణించాడు.మార్క్స్ సమాధి వద్ద ఎంగెల్స్ చేసిన ప్రసంగంలోడార్విన్ ఏ విధంగానైతే జీవ ప్రకృతి యొక్క అభివృద్ధి నియమాన్ని కనుగొన్నాడో సరిగ్గా అదే విధంగా మార్క్స్ మానవ చరిత్ర యొక్క అభివృద్ధి నియమాన్ని కనుగొన్నాడు. మార్క్స్ కనిపెట్టిన సమగ్రమైన శాస్త్రీయమైన చారిత్రక భౌతిక వాద సిద్ధాంతం అంతవరకు చరిత్ర గురించిఉనికిలో ఉన్న అన్ని రకాల తప్పుడు సిద్ధాంతాలను చావు దెబ్బ కొట్టింది.

కారల్ మార్క్స్ ఒక గొప్ప మానవ విజ్ఞాన శాస్త్రవేత్త .అన్నింటికంటే ముఖ్యంగా ఆయన గొప్పశ్రామిక విప్లవవాది.ఆయన మానవ సమాజ విముక్తి పథ నిర్దేశకుడు. 19వ శతాబ్దం మానవ సమాజానికి సమర్పించిన ఒక మహోన్నత మానవుడు. పెట్టుబడిదారీ సమాజాన్ని కూల్చివేయడానికి ఆధునిక శ్రామిక వర్గ విముక్తికి తోడ్పడడమే ఆయన జీవిత పరమోద్దేశం. ఆయన పేరు యుగ యుగాలదాకాఅమరంగాఉంటుంది .అలాగే ఆ కృషికూడా చిరస్థాయిగా ఉంటుంది అదనపు విలువ ఆవిష్కారంతో సమకాలిన పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానాన్ని శాసించే ప్రత్యేక గతి నియమాన్ని మార్క్స్ కనుగొనడంలో చరిత్రలో మొదటి సారిగా వెలుగు ప్రసరించబడింది.కామ్రేడ్ మార్క్స్ పరిశోధన జరిపిన ప్రతి రంగంలోనూ ,తాత్విక ,చారిత్రక, ఆర్థిక ,సామాజిక వర్గ పోరాట రంగాల్లోని ప్రతి ఒక్క విషయంపై కూడా ఆయన స్వతంత్రమైన లోతైన ఆవిష్కరణ చేశాడు ."మార్క్సిజము అంటే ప్రకృతి మానవ సమాజాల అభివృద్ధిని నియంత్రించే నియమాల విజ్ఞాన శాస్త్రం .దోపిడికి పీడనకు గురయ్యే ప్రజారాశుల విప్లవ శాస్త్రం. సకల దేశాలలో సోషలిజానికి విజయాన్ని సాధించే శాస్త్రం కమ్యూనిస్టు సమాజాన్ని నిర్మించే శాస్త్రం". కామ్రేడ్ స్టాలిన్

"మార్క్సిజం నిర్జీవమైన పిడివాదం కాదు పరిపూర్ణమైన తయారై సిద్ధంగా ఉన్న మార్పు చెందని సిద్ధాంతం కాదు ఆచరణకు అది సజీవ మార్గదర్శి "కామ్రేడ్ లెనిన్. కార్మిక కమ్యూనిస్టు ఉద్యమాలు నేడు అనేక బలహీనతలతో వెనుకంజలో ఉండడానికి గల కారణాలని మార్క్సిజము దృష్టి కోణం నుండి సమీక్షించుకొని శ్రామిక వర్గ అధికారం కోసం ప్రజలను సోషలిస్టు చైతన్యం వంతం చేయడమే నేటి ప్రధాన కర్తవ్యం. సమాజంలో దోపిడీ, పీడన అసామానతలు నిరుద్యోగం, దారిద్ర్యం, పేదరికానికి కారణమైన పెట్టుబడి దారి వ్యవస్థను కూల్చి, సమసమాజ స్థాపన కోసం కృషిచేయడమే ఆయనకు ఇచ్చే ఘనమైన నివాళి. కమ్యూనిస్ట్‌సిద్ధాంత వేత్త కారల్‌మార్క్స్‌కు జోహార్లు.



జంపన్న (డెమొక్రటిక్ సోషలిస్ట్)

## ప్రశ్నకు తద్దినం పెట్టారు



మానవ పరిణామానికి మూలమైన ప్రశ్నకు ఈ సమాజంలో చచ్చిపోయింది. చచ్చి పోయిందని చెప్పడం సరికాదేమో. చంపివేశారని చెప్పడం సబబుగా ఉంటుంది. ప్రశ్న స్థానంలో గుడ్డి అనుకరణ, అనుసరణ మొదలైంది. చెప్పింది విని గుడ్డిగా అనుసరించే ఒక వర్గం తయారైంది. అది రోజు రోజుకూవిస్తరిస్తూ పోతున్నది.ప్రశ్న,ఆలోచన,అభిప్రా యాల వ్యక్తీకరణ అనేది మెదడును ఉపయోగించే వారి సహజ లక్షణం. ప్రతిపౌరుడి ఆలోచనభిన్నమైనదే. అందరి ఆలోచనలు భిన్నంగానే ఉంటాయి.ఆలోచన, ప్రశ్న,విమర్శ, అభివ్యక్తి అనేవి ప్రతి పౌరుడి ప్రాథమిక లక్షణాలు హక్కులే అవుతాయి. ప్రజాస్వామిక వ్యవస్థకు ఉండవలసిన ప్రాథమిక లక్షణం,స్వభావం. ప్రజాస్వామికవ్యవస్థలో జీవిస్తూ దానిలోని మూల లక్షణమైన "ప్రశ్న"ను వ్యతిరేకించడం, తిరస్కరించడం, అణచివేయడంఇక్కడ కొనసాగుతున్నది. అనుకూలమైనా, అననుకూలమైనా, ప్రతికూలమైనా, పూర్తిగా వ్యతిరేకమైనా వాటితో ఎవ్వరికీ ఏకీభావం లేకపోయినా, అవి పూర్తి వ్యతిరేక భావాలైనా..వాటిని గౌరవించి తీరాలి. అదే ఆధునిక,నాగరిక లక్షణాలు అని రాజ్యాంగం స్పష్టంగా చెబుతున్నది.అది పౌరుల ప్రాథమిక హక్కు. ఆ హక్కును కోర్టులు తప్పకుండా గౌరవించి,అమలు జరిగేలాచూడాలి. రాజ్యాంగం అమలులోకి వచ్చినఎనిమిది దశాబ్దాలతరువాత కూడా సుప్రీంకోర్టు ఒక రాష్ట్ర హై కోర్టుకు పరోక్షంగా ఈ ప్రాథమిక విషయాన్ని వివరించవలసిన/చెప్పవలసిన దైన్యంలోకి దేశ ప్రజాస్వామ్యం దిగజారి పోయింది. సుప్రీంకోర్టు.... గత యేదాది ఈ సంగతి వివరిస్తూ ఒక తీర్పునిచ్చింది. ఆ తీర్పు సారాంశమే ఇది. పౌరుడి హక్కుల గురించి రాజ్యాంగ కోర్టులైన హై కోర్టులు కూడా ఇలాంటి సంగతులను చెప్పించు కునే దుస్థితి విచారకరం. పౌరుల ఆలోచనలు, అభిప్రాయాలు న్యాయాధికారులకు కూడా నచ్చనవసరం లేదని కూడా సుప్రీం కోర్టు ఆ తీర్పులో వివరించింది. అన్ని రకాల ఆలోచనలను గౌరవించి, పౌరుడి ప్రాథమిక రాజ్యాంగ హక్కును గౌరవించి తీరాలని వివరించింది, మొత్తం రాజ్య వ్యవస్థను ఆదేశించింది. రాజ్యాంగాన్ని సంపూర్ణంగా అమలు పరుస్తూ పౌరుల హక్కులను కాపాడుతూ ప్రజాస్వామ్యాన్ని రక్షించడమే న్యాయ వ్యవస్థ ప్రధాన కర్తవ్యం అని దేశంలోని అన్ని రాజ్యాంగ కోర్టులకు పరోక్షంగా హితవు పలికింది. దేశ అత్యున్నత కోర్టు సుప్రీమ్ చెప్పింది కాబట్టి ఇది అన్ని కోర్టులకూ ఒక ఆదేశం కిందే లెక్క. పౌరుల ఆలోచనలు, అభిప్రాయాలపై కేసులు నమోదు చేసిన, చేస్తున్న పోలీసులకు కూడా సుప్రీంచురకలు వేసింది. ముందుగా తాము పౌరులమే అన్న వాస్తవాన్ని గుర్తుంచుకోవాలని తీర్పులో పోలీసులకు కూడా హితవు పలికింది. ఇప్పటికీ రాజ్యాంగ కోర్టు లు ఇచ్చే తీర్పుల్లో, రాజ్య వ్యవస్థ వ్యవహార శైలిలో ఈ తీర్పు ప్రభావం ఏమీ కనిపించడం లేదు.



గోవర్ధన్ గందె,
9347056621